చైనా లక్ష్యంగా భద్రతా ప్రణాళిక

- 48 పేజీల నివేదికను ఆవిష్కరించిన అమెరికా

వాషింగ్టన్ : అమెరికాకు అత్యంత భౌగోళిక, రాజకీయ సవాలుగా చైనాను అమెరికా అభివర్ణించింది. చైనాను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని 48 పేజీల భద్రతా ప్రణాళికను బుధవారం ఆవిష్కరించింది. భాగస్వామ్య సవాళ్లపై పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరాన్ని అంగీకరించింది. ప్రచ్ఛన్న యుద్ధానంతర శకం ఇక ముగిసినట్లేనని ఆ ప్రణాళిక పేర్కొంది. అమెరికా ఇక వ్యూహాత్మక పోటీ కోణం నుంచే యావత్ ప్రపంచాన్ని చూడడాన్ని నివారిస్తుందని పేర్కొంది. తర్వాత రాబోయే దాని గురించి ప్రధాన శక్తుల మధ్య జరిగే పోటీ గురించే ఈ వ్యూహం మాట్లాడుతోంది. నియంతృత్వాలు వర్సెస్ ప్రజాస్వామ్యాల మధ్య రాబోతున్న పోరాటంగా అభివర్ణించింది. దేశీయంగా పెట్టుబడులు పెట్టడం ద్వారా, లేదా భావ సారూప్య దేశాలతో కలిసి సహకారాన్ని మరింత విస్తరించడం ద్వారా ఖండాంతర సవాళ్ల ప్రభావాలను ఎదుర్కొనాలని భావిస్తోందని ఆ భద్రతా ప్రణాళిక పేర్కొంది. అంతర్జాతీయ వ్యవస్థకు ఒక రూపమిచ్చేందుకు శక్తిసామర్థ్యాలు కలిగిన ఏకైక పోటీ దేశంగా చైనాను గుర్తించింది. మూడంచెల వ్యూహాన్ని ఈ ప్రణాళిక ఆవిష్కరించింది.

ది హిందూ గ్రూప్ డిజిటల్ ఎడిటర్‌గా శ్రీరామ్ శ్రీనివాసన్

చెన్నై : ది హిందూ గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టిహెచ్‌జిపిపిఎల్) డిజిటల్ ఎడిటర్‌గా శ్రీరామ్ శ్రీనివాసన్ నియమితులయ్యారు. ఈ నియామకం ఈ నెల 17 నుంచి అమల్లోకి వస్తుంది. శ్రీరామ్ ప్రస్తుతం ది హిందూ స్ట్రేటజీ, డిజిటిల్ ఎడిటర్‌గా 2016 జనవరి నుంచి బాధ్యతల్లో ఉన్నారు. ది హిందూ, ది హిందూ బిజినెస్‌లైన్, ఫ్రంట్‌లైన్, స్టోర్స్‌స్టార్‌లను టిహెచ్‌జిపిపిఎల్ ప్రచురిస్తుంది.

సిఎఎపై ఎటువంటి సమస్య లేవనెత్తకూడదు

- హిందూ ధర్మ పరిషత్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిఎఎకి సంబంధించి ఎవరూ ఎటువంటి సమస్యను లేవనెత్తకూడదని హిందూ ధర్మ పరిషత్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సిఎఎ గురించి ఎవరూ లేవనెత్తడానికి అనుమతించకూడదని ఎలా అంటారని పిటిషనర్ తరపు న్యాయవాదిని జస్టిస్ కౌల్ మందలించారు. ఈ పిటిషన్ వింతగా ఉందని పేర్కొంది.

మాస్కో-ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ : మాస్కో-ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయని, దీంతో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు తెలిపారు. మాస్కో నుంచి ఢిల్లీ బయల్దేరిన విమానంలో బాంబు ఉందంటూ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం అర్ధరాత్రి ఇ-మెయిల్ వచ్చింది. ఈ విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటల ప్రాంతంలో ల్యాండ్ అయ్యింది. దీంతో, భద్రతా అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో విమానంలో సిబ్బంది సహా 400 మంది ప్రయాణికులు ఉన్నారు. అనుమానాస్పద వస్తువులేమీ కన్పించలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు విచారణకు ఆదేశించారు.

'ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే 10% అదనపు ఛార్జి'

బెంగళూరు: రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే 10 శాతం అదనంగా ఛార్జీలను వసూలు చేసుకోవడానికి ఓలా, ఉబర్, రాపిడోలకు కర్ణాటక హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం త్వరలో చట్ట ప్రకారం ఛార్జీలను నిర్ణయించే వరకూ ఈ అదనపు ఛార్జీలను వసూలు చేసుకోవచ్చని తెలిపింది.

12న హిమాచల్ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను నిర్వహిస్తారు. ఒకేతేదీన ఫలితాలను ప్రకటిస్తారు. ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఎలక్షన్ కమిషన్ చీఫ్ రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల అసెంబ్లీల గడువు ముగియడానికి 40 రోజుల వ్యత్యాసం ఉందని అన్నారు. నిబంధనల ప్రకారం.. ఒక రాష్ట్ర ఫలితం మరోదానిపై ప్రభావం చూపకుండా ఉండేందుకు కనీసం 30 రోజులు ఉండాలని రాజీవ్ కుమార్ తెలిపారు. గుజరాత్ అసెంబ్లీ ఫిబ్రవరిలో, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ జనవరిలో ముగియనుండగా, రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి అధికారంలో ఉంది. వాతావరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నామని.. హిమాచల్ ఎన్నికలను శీతాకాలం హిమపాతం ప్రారంభానికి ముందే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి 70 రోజులకు బదులుగా 57 రోజులు అమలులో ఉంటుందని అన్నారు. 2017లోనూ రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించగా.. ఫలితాలు డిసెంబర్‌లోనే వెలువడ్డాయి. గుజరాత్‌లో ఎన్నికలు రెండు విడతల్లో జరిగాయి.

ఎన్నికల నియమావళికి సవరణ వద్దు

- అది రాజకీయ పార్టీల హక్కుల ఉల్లంఘనే
- ఇసికి సీతారాం ఏచూరి లేఖ

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రవర్తనా నియమావళికి చేయతలపెట్టిన ప్రతిపాదిత సవరణను ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో చేసే వాగ్దానాలకు సంబంధించి ఎన్నికల నిబంధనావళిని సవరించాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. అయితే, ప్రతిపాదిత సవరణ అనవసరమని సిపిఎం అభిప్రాయపడుతోందని, ఇందుకు ఈ క్రింది కారణాలు ఉన్నాయని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు.

- రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం, ఎన్నికల పర్యవేక్షణ, దిశా నిర్దేశం, నియంత్రణ వంటి కర్తవ్యాలను ఎన్నికల కమిషన్‌కి అప్పగించారు. అంతేకానీ ఎన్నికల సమయంలో ప్రజలకు చేపట్టే సంక్షేమ చర్యల గురించి రాజకీయ పార్టీలు చేసే హామీలు, విధాన ప్రకటనలను నియంత్రించే లేదా అంచనా వేసే అధికారాలను ఎన్నికల కమిషన్‌కు కల్పించలేదు. ఇప్పుడు ఎన్నికల నిబంధనావళికి చేయతలపెట్టిన ప్రతిపాదిత సవరణ, పార్టీలు చేసే ఎన్నికల వాగ్దానాల వివరాలను, వాటి ఆర్థిక పర్యవసానాలను వెల్లడించే ప్రొఫార్మా వల్ల రాజకీయ, విధానపరమైన అంశాల్లో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. ఇవేవీ కూడా కమిషన్ పరిధిలోకి రావు.
- చేసిన వాగ్దానాలకు సంబంధించి ఏ మేరకు ఆర్థిక పర్యవసానాలు ఎదురవుతాయి, ఇచ్చిన హామీలను అమలు చేసే క్రమంలో అదనపు వనరుల సమీకరణ బాధ్యత వంటి అంశాలను ప్రొఫార్మా ప్రస్తావిస్తోంది. ఇవన్నీ కూడా రాజకీయ, విధానపరమైన అంశాలే, ద్రవ్య సుస్థిరతకు సంబంధించినవే. అసలు ద్రవ్య సుస్థిరత అనే దానిపైనే భిన్నమైన అభిప్రాయాలు వుంటాయి. ఉదాహరణకు, ద్రవ్య బాధ్యతా, బడ్జెట్ నిర్వహణా చట్టంలో ద్రవ్య లోటును జిడిపిలో 3 శాతానికి పరిమితం చేయడాన్ని సిపిఎం తీవ్రంగా విమర్శిస్తోందని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఆర్థిక సంప్రదాయవాద ఆలోచనలకు ప్రత్నామ్నాయాలు వున్నాయి.
- సుబ్రమణియం బాలాజీ తీర్పు పున:పరిశీలనకు సంబంధించిన కేసులో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల కమిషన్ ఒక అఫిడవిట్‌ను సుప్రీం కోర్టుకు సమర్పించింది. "ఎన్నికల ముందు లేదా ఎన్నికల తర్వాత ప్రకటించే లేదా పంపిణీ చేసే ఏ ఉచితాలైనా అవి ఆయా పార్టీలకు సంబంధించిన విధానపరమైన నిర్ణయమే." అని కమిషన్ స్పష్టం చేసింది. అయితే అటువంటి విధానాలు ఆర్థికంగా క్రియాశీలమైనవా కాదా, లేక వాటివల్ల ఆయా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై దుష్ప్రభావాలను చూపిస్తాయా లేదా అనేది ఆయా రాష్ట్ర ఓటర్లు పరిశీలించాల్సిన, నిర్ణయించాల్సిన అంశమని పేర్కొంది.

ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయంలో తీసుకునే నిర్ణయాలు, ప్రభుత్వ విధానాలను తాము నియంత్రించలేమని కూడా ఎన్నికల కమిషన్ అంగీకరించింది. చట్టంలో ఆ మేరకు నిబంధనలు లేకుండా ఇటువంటి చర్యలకు పాల్పడితే, అది అధికారాలను అతిక్రమించడమే కాగలదని పేర్కొంది. ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ వైఖరి సరైనది, చెల్లుబాటయ్యేదని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, కమిషన్ ఇప్పుడు తన మనసు మార్చుకున్నట్లుగా కనిపిస్తోందని, రాజకీయ పార్టీలకు, ప్రజలకు సంబంధించిన రంగంలోకి మరింత చొరబడాలని భావిస్తున్నట్లుగా వుందని అన్నారు.

- సుబ్రమణియం బాలాజీ కేసులో ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని కోరుతున్న పిటిషన్‌ను కొత్త ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేసే త్రిసభ్య ధర్మాసనం పరిశీలించాలని అప్పటి ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ నేతృత్వంలోని సుప్రీం కోర్టు బెంచ్ ఈ ఏడాది ఆగస్టు 26న నిర్ణయించింది. అందువల్ల ఎన్నికల వాగ్దానాలు, వారిచ్చే ఉచితాల అంశం ఇంకా సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుంది.

ఇటువంటి పరిస్థితుల్లో, ప్రజల ఆందోళనలను పరిష్కరించేందుకు, వారికి విధానపరమైన, సంక్షేమ చర్యలను ప్రకటించేందుకు రాజకీయ పార్టీలకు గల హక్కులను ఉల్లంఘించే రీతిలో ప్రొఫార్మాను ప్రవేశపెట్టడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించేందుకు ఎన్నికల కమిషన్ చేపట్టిన చొరవ అవాంఛనీయమైనదని ఏచూరి లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, తక్షణమే ఈ ప్రతిపాదనను ఎన్నికల కమిషన్ ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని ఏచూరి కోరారు.

జ్ఞానవాపి కేసులో కార్బన్ డేటింగ్ టెస్ట్‌కు

వారణాసి కోర్టు తిరస్కరణ

- సుప్రీంకు వెళ్తామన్న పిటిషనర్లు

లక్నో : వారణాసిలోని జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో శివలింగంగా భావిస్తున్న దానికి కార్బన్ డేటింగ్ పరీక్ష (కార్బన్ సాయంతో శాస్త్రీయ పద్ధతిలో వయసు తెలుసుకునే పరీక్ష) చేయించాలని ఐదుగురు హిందూ మహిళలు వేసిన పిటిషన్‌ను వారణాసి కోర్టు శుక్రవారం తిరస్కరించింది. దీంతో, సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు వారు తెలిపారు. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో ఈ ఏడాది ప్రారంభంలో వీడియో సర్వే నిర్వహించగా, శివలింగం ఆకృతిలో ఒక శిల కనిపించింది. అది నమాజ్‌కు ముందు వినియోగించే ఫౌంటేన్‌గా ముస్లిములు చెబుతున్నారు. మసీదు లోపల ఉన్న మందిరంలో పూజలు చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ ఐదుగురు హిందూ మహిళలు వేసిన పిటీషన్ విచారణలో దిగువ కోర్టు వీడియో సర్వేకు ఆదేశించింది. ఈ వీడియో సర్వేలో కనుగొన్న శివలింగానికి కార్బన్ డేటింగ్ పరీక్ష నిర్వహించాలని ఐదుగురు హిందువులు వారణాసి కోర్టులో గత నెలలో పిటీషన్ వేశారు. శుక్రవారం ఈ పిటీషన్‌ను అత్యంత సీనియర్ న్యాయమూర్తి తిరస్కరించారు. కార్బన్ డేటింగ్ వంటి ఎలాంటి పరీక్షనైనా నిర్వహించడం శివలింగం వున్న ప్రదేశాన్ని సీల్ చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం అవుతుందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. శివలింగానికి ఏదైనా హాని జరిగితే శివలింగాన్ని పరిరక్షించాలనే సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని తెలిపారు. శివలింగానికి ఏదైనా హాని జరిగితే మతపరమైన మనోభావాలు దెబ్బతింటాయని, ఈ వివాదానికి చట్టపరమైన పరిష్కారం లభించే అవకాశాలు తగ్గుతాయని కోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని మహిళా పిటీషనర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ విచారణపై మసీదు కమిటీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. శివలింగంగా భావిస్తున్న వస్తువు శివలింగం కాదని, అది ఒక 'ఫౌంటేన్' అని, హిందూ మహిళల వేసిన పిటీషన్‌ను కొట్టివేయాలని మసీదు కమిటీ చేసిన విజ్ఞప్తిని సెప్టెంబర్ 12న వారణాసి జిల్లా కోర్టు న్యాయమూర్తి కొట్టివేశారు. హిందూ మహిళలు మసీదులో యాజమాన్య హక్కులను కోరుకోవడం లేదని, పూజలు చేసే హక్కును కోరుకుంటున్నారని అప్పట్లో వ్యాఖ్యలు చేసింది. హిందూ దేవాలయాలను కూల్చివేసి మసీదులు కట్టారంటూ ఉద్రిక్తతలు సృష్టించే హిందూ మతతత్వ శక్తులు తరచూ ఆరోపించే మసీదుల జాబితాలో ఈ మసీదు కూడా ఉంది.

ఐఎన్ఎస్ అరిహంత్ నుంచి బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ : దేశానికి చెందిన న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైల్ సబ్‌మైరెన్ ఐఎన్ఎస్ అరిహంత్ నుంచి శుక్రవారం బాలిస్టిక్ మిస్సైల్‌ను విజయవంతంగా ప్రయోగించారు. గతంలోనూ ఈ సబ్‌మైరెన్ నుంచి లక్ష్యాలను చేధించినా, ఈసారి పరీక్షల్లో మాత్రం సబ్‌మైరెన్ తనకుతానుగా మిస్సైల్‌ను ప్రయోగించింది. శుక్రవారం పరీక్షతో భారత నౌకాదళ అణుశక్తి సామర్థ్యాన్ని మరో రుజువు చేసినట్లు అయింది. ఈ సబ్‌మైరెన్‌తో నీటి అడుగు నుంచి కూడా చైనా, పాకిస్థాన్‌ల్లోని లక్ష్యాలను కూడా చేధించవచ్చు.

త్రిపుర బిజెపి కూటమిలోని మరో ఎమ్మెల్యే రాజీనామా

ఆగర్తల : వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపురలో బిజెపికి వరసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎన్‌డిఎ కూటమిలోని ఐపిఎఫ్‌టికి చెందిన ఎమ్మెల్యే ప్రద్యోత్ కిషోర్ దెబ్బర్మ తాజాగా తన పదవికి రాజీనామా చేశారు.

ములాయం కుటుంబ సభ్యులకు పరామర్శ

లక్నో : ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్‌పి వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యులను సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ములాయం కన్నుమూసిన సంగతి తెలిసిందే. సైఫై గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి, నివాళులర్పించారు. ములాయం కుమారుడు అఖిలేష్ యాదవ్‌తోపాటు రామ్‌గోపాల్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట సిపిఎం ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర నాయకులు ముకుత్‌సింగ్ ఉన్నారు.

సిఎం విజయన్‌సహా సిపిఎం నేతలపై కేసును కొట్టివేసిన కేరళ హైకోర్టు

కొచ్చి : కేరళ ముఖ్యమంత్రి విజయన్‌సహా 12 మంది సిపిఎం నేతలపై నమోదైన కేసును కేరళ హైకోర్టు గురువారం కొట్టివేసింది. చట్టవిరుద్ధంగా సమావేశమయ్యారని, అల్లర్లకు పాల్పడ్డారని ఓ న్యాయవాది వేసిన పిటిషన్‌ను సవాల్ చేస్తూ సిపిఎం నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఆసియన్ దేశాల వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రవేశించడాన్ని వ్యతిరేకిస్తూ 2009లో 500 కిలోమీటర్ల మేర మానవహారంతో విజయన్ సహా పలువురు సిపిఎం నేతలు నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆందోళనకారులు ఎటువంటి క్రిమినల్ కేసుకు పాల్పడలేదని, నిరసన నిరవధికంగా కొనసాగలేదని, సాధారణ జీవితం స్తంభించలేదని, దీంతో ఈ కేసులో ఐపిసి పీనల్ కోడ్ కింద చట్టవిరుద్ధమైన సమావేశం, అలర్లకు సంబంధించిన అంశాలు లేనందున సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, కేరళ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయన్, మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానంద, ప్రస్తుత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టిసహా 12 మంది మందిపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు జస్టిస్ బెచుకురియన్ థామస్ పేర్కొన్నారు. అసెంబ్లీ సభ్యులపై నేరపూరిత శక్తులను వినియోగించినట్లు, మానవహారాన్ని నిరవధికంగా కొనసాగించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించిన సందర్భం లేదని, ఐపిసి సెక్షన్ 141కి అవకాశం లేదని పేర్కొన్నారు. ఎటువంటి హాని, తీవ్రమైన అసౌకర్యం కలిగించకుండా తమ అసమ్మతి వ్యక్తం చేసినపుడు వారిపై నేరపూరితంగా చర్యలు చేపట్టాలనుకోవడం అవివేక చర్య అవుతుందని హైకోర్టు పేర్కొంది.

ఈ కేసు రాజకీయ ప్రేరేపితం : సిపిఎం

తమపై దురుద్దేశపూర్వకంగా, తప్పుడు ఉద్దేశాలతో కేసు నమోదు చేశారని హైకోర్టులో వేసిన పిటిషన్‌లో సిపిఎం నేతలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం తమ హక్కుని వినియోగించుకోవడంలో భాగంగానే మానవహారం నిర్వహించామని తెలిపారు. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని పేర్కొన్నారు.

ఎలక్టోరల్ బాండ్లు ప్రజాస్వామ్య మూలాలకు దెబ్బ

- సుప్రీంకోర్టులో ప్రశాంత్ భూషణ్, కపిల్ సిబల్

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చడం కోసం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం ప్రజాస్వామ్య మూలాలకు దెబ్బ అనీ, దీనిని విస్తృతంగా విచారించాల్సి ఉందని సుప్రీంకోర్టుకు సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, కపిల్‌సిబల్ తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లపై సిపిఐ(ఎం)తోపాటు వివిధ సంస్థలు, వ్యక్తులు దాఖలు చేసిన ఐదు పిటిషన్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ బివి నాగరత్నంతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ప్రజాస్వామ్య మూలాలను ఎలక్టోరల్ బాండ్ల పథకం దెబ్బతీస్తోందని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తులు డిసెంబర్ 6 నాటికి కేసు వాయిదా వేశారు.

శాంతి చర్చలకు ఉక్రెయిన్ తిరస్కరణ

- పుతిన్ వెల్లడి

అస్తానా : శాంతి చర్చలను ఉక్రెయిన్ తిరస్కరిస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం జర్నలిస్టులకు చెప్పారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పరిష్కారమయ్యేందుకు గల అవకాశాల గురించి విలేకర్లు ప్రశ్నించగా, ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. తాము చర్చలను కోరుకుంటున్నామని చెబుతూ వచ్చిన కీవ్ ప్రభుత్వం ఇప్పుడు ఆ చర్చలను నిషేధించేలా నిర్ణయం తీసుకుందని అన్నారు. కజకిస్తాన్ రాజధాని అస్తానాలో పత్రికా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. పుతిన్‌తో ఎలాంటి చర్చలూ జరపడాన్ని నిషేధిస్తూ ఈ నెల ఆరంభంలో జెలెన్‌స్కీ డిక్రీ జారీ చేశారు. రష్యాకు పుతిన్ కాకుండా వేరే అధ్యక్షుడు వున్నపుడే ఉక్రెయిన్ వారితో చర్చలు జరుపుతుందని చెప్పారు. ఉక్రెయిన్ వైఖరి మారినట్లైతే టర్కీతో సహా ఇతర దేశాలు మధ్యవర్తిత్వం వహించడానికి అవకాశం వుందని పుతిన్ వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ నాటోలో చేరితే మూడో ప్రపంచ యుద్ధం

ఉక్రెయిన్ నాటోలో చేరితే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందని రష్యా జాతీయ భద్రతా మండలి డిప్యూటీ సెక్రటరీ అలెగ్జాండర్ వెనెడిక్టోవ్ అన్నారు. ఉక్రెయిన్‌కు సాయం అందించడం ద్వారా ఉద్దేశపూర్వకంగా సమస్యలు సృష్టించేందుకు నాటో మిత్రపక్షాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. నాటోలో భాగమయ్యే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ చేసిన ప్రకటనపై ఆయన ఈ మేరకు ప్రతిస్పందించారు.

ఆయుధ డిపోపై దాడి

రష్యాలోని దక్షిణ బెల్గొరాడ్ ప్రాంతంలోని ఆయుధ డిపోపై ఉక్రెయిన్ మిలటరీ బాంబు దాడి జరిపిందని ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. ఈ దాడితో డిపోలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని, పేలుళ్లు సంభవించాయని తెలిపారు. ఈ దాడుల కారణంగా సమీప గ్రామ ప్రజలను అక్కడ నుండి ఖాళీ చేయించారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రజాభిప్రాయ సేకరణను ఖండించిన కొద్దిసేపటికే ఉక్రెయిన్‌లోని 40 ప్రాంతాలపై రష్యా క్షిపణి దాడులు చేసింది. దక్షిణ నగరమైన మైకోలైవ్ ధ్వంసమైంది. ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, షిప్‌యార్డ్ ధ్వంసమయ్యాయి. కీవ్‌పై డ్రోన్ దాడి కూడా జరిగింది. నికోపోల్‌లోని 30 అంతస్తుల భవనం మరియు గ్యాస్ పైప్‌లైన్‌పై దాడి జరిగింది.

సాయిబాబా నిర్దోషి

(మొదటి పేజీ తరువాయి)

2022 ఆగస్టులో మరణించారు. మావోయిస్టుల సంబంధాలు, దేశంపై యుద్ధం చేసే కార్యకలాపాలకు పాల్పడినందుకు దోషులుగా నిర్ధారిస్తూ 2017 మార్చిలో మహారాష్ట్రలోని గడ్చిరోలిలోని సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం నాగపూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. ఆ తీర్పును సవాలు చేస్తూ సాయిబాబా దాఖలు చేసిన అప్పీల్‌పై డివిజన్ బెంచ్ విచారించింది. "ఉగ్రవాదం జాతీయ భద్రతకు ముప్పు. అప్పుడు దానికి వ్యతిరేకంగా చట్టబద్ధమైన బలగాలు ఆయుధాలతో మోహరించాలి. పౌర ప్రజాస్వామ్యం నిందితులకు కల్పించిన విధానపరమైన భద్రతలను త్యాగం చేయదు" అని డివిజన్ బెంచ్ తీర్పులో పేర్కొంది. "నిందితులకు చట్టపరంగా అందించబడిన రక్షణ, ఎంత చిన్నదైనప్పటికీ రక్షించబడాలని మేము కోరుకుంటున్నాము" అని తెలిపింది. "అటువంటి రక్షణలను ఏమేరకు ఉల్లంఘించినా ప్రతికూల ఫలితాన్నే కలిగిస్తుంది. న్యాయ ప్రక్రియ నుంచి నిష్క్రమణ తీవ్రవాద వ్యవస్థను ప్రోత్సహిస్తుంది" అని పేర్కొంది. యుఎపిఎలోని సెక్షన్ 45 (1) కింద చెల్లుబాటయ్యేందుకు అవకాశం లేనప్పుడు సెషన్స్ ట్రయల్స్ ప్రొసీడింగ్‌లు శూన్యమని భావిస్తున్నామని స్పష్టం చేసింది.

పోలియో, పక్షవాతం కారణంగా చక్రాల కుర్చీలో ఉన్న సాయిబాబా, వైద్య కారణాలతో తన శిక్షను నిలిపివేయాలని కోరుతూ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. కిడ్నీ, వెన్నెముక సమస్యలతో పాటు పలు రోగాలతో బాధపడుతున్నట్లు తెలిపారు.

నేడు సుప్రీంకోర్టు విచారణ

ముంబయి హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎన్ఐఎ, మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ కేసును సుప్రీంకోర్టు శనివారం విచారించనుంది. ఈ కేసును అత్యవసరంగా లిస్ట్ చేయాలని కోరుతూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయమూర్తులు జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ వచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. శనివారం ఉదయం 11 గంటల తరువాత జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించనుంది.

ఏడేళ్ల జైలు జీవితం తరువాత ఆరోగ్యం క్షీణించింది : సాయిబాబా భార్య వసంత కుమారి

ఏడేళ్ల జైలు జీవితం తరువాత సాయిబాబా ఆరోగ్యం బాగా క్షీణించిందని ఆయన భార్య వసంత కుమారి తెలిపారు. ఆయనను కేసులో ఇరికించారని, నిర్దోషిగా విడుదలవుతారనే నమ్మకం ఉందని చెప్పారు. న్యాయ వ్యవస్థకు, తమకు మద్దతు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశామని అన్నారు.

ICICI Home Finance
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖాపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక